# ఆటల కోసం.

డి. వి. ఆర్. భాస్కరశాస్త్రి బి. ఎ, బి. ఇడి.

రోడ్డు మలుపులో కారు హారన్ చప్పుడు వినపడగానే. లలితమ్మగారు విరబోసుకున్న జుట్టుతోనే, చేతిలో దువ్వెనతోనే వీధిలోకి వచ్చింది. శేఖరం "అమ్మా! అమ్మోయ్! ఈవేళ కోతి కొమ్మచ్చి ఆడుకోడానికి వెళ్తానే!" అంటూ కారు దిగేడు తొందరగా. డ్రైవరు పుస్తకాలు కారులోంచి తీసి ఇంట్లో పెట్టాడు. "అమ్మో! కోతి కొమ్మచ్చే? క్రిందపడితే కాళ్ళు విరిగిపోతాయి. వద్దుబాబూ!" అంటూ తొమ్మిదేళ్ల శేఖరాన్ని ఎత్తుకోబోయింది ఆవిడ. "పోవే నువ్వెప్పుడూ నన్ను ఆడుకోనియ్యవ్!" అని తల్లి కడుపుమీద ఒక గుద్దు గుద్ది, శేఖరం "నేను వెళ్తానే! అమ్మా! వెళ్ళి తీర్తానే!" అంటూ దీర్ఘంతీస్తూ నేలమీద పడి దొర్లడం ప్రారంభించేడు. సావిడి నల్లగచ్చుదైనా, శుభ్రంగా తుడిచినదైనా, "అయ్యయ్యో! వళ్ళు అంతా మట్టి అవుతుందిరా నాయనా లే!" అంటూ దగ్గరకు రాబోయింది లలితమ్మగారు. "అయితే అయిందిలే!" అంటూ బొల్లి ఏడుపు ఏడుస్తూ దూరంగా దొర్లడం మొదలెట్టేడు శేఖరం. "అరెరె, అదేంపనిరా, నాన్నా!"అంటూ చేతిలోపేపరుతో మేడమీంచి దిగేరు వెంకట్రావుగారు శేఖరం అల్లరి విని. "చూడండి! వాడు కోతి కొమ్మచ్చి ఆడుకోడానికి వెడ్తాడట- కాళ్లు విరగ కొట్టు కోడానికి" అంది లలితమ్మగారు, జుట్టు ముడివేసుకుంటూ. "నే వెడతా నాన్నా, ఆడుకోవాలి!" దీర్ఘం తీసేడు శేఖరం. "అబ్బెబ్బె!-లే, వెడుదుగానిలే!" అన్నారు వెంకట్రావుగారు, శేఖరాన్ని వంగుని లేవదీస్తూ శేఖరం నవ్వుతూ, "అమ్మ మంచిది కాదు నాన్నా! వెళ్ళ వద్దంటోంది!" అని ఫిర్యాదు చేసేడు. "అమ్మకు తెలియదురా. అమ్మ మంచిదికాదు. మన మిద్దం మిప్పుడు కార్లో. " అనే తండ్రి మాటను "వెళ్ళి కోతి కొమ్మచ్చి ఆడుకుందాం మా స్నేహితులతో" అని పూర్తిచేసేడు శేఖరం. "నీలాటి మంచి కుఱ్ఱాడు వేశేడట 'దీక్ష' అనే సినీమాలో! చూచివద్దాం" అన్నారు వెంకట్రావుగారు. శేఖరం మాట విననట్టు. నాలాంటి వాడేనా ??. .. అయితేనడు!" అని ఒక్కసారి పైకిసాగి, కన్బొమలెగరేసి. శేఖరంకూడా బయలుదేరేడు. లలితమ్మగారి ముఖం చేటంత అయింది. కొడుకు కోతి కొమ్మచ్చి కోసం వెళ్ళడం మానినందుకు!

వెంకట్రావుగారికి అది అలవాటు. ఎప్పుడు శేఖరం ఆడుకోడానికి బయలు దేరినా, ఏవో మాయ మాటలు ఆ గుంటడికి చెప్పి మానిపిస్తుంటాడు, ఆయనకూ లలితమ్మకూ కూడా సాధారణముగా ప్రతి ఆటలోనూ, ఏదో ఒక ప్రమాదం కనపడుతూనే ఉంటుంది! పరుగెత్తితే, పడితే కాళ్ళు కొట్టుకు పోతాయి! చెడుగుడు ఆడితే, కాళ్ళు బెణకవచ్చు. వంటినిండా మట్టి అవవచ్చు! బంతి ఆడితే కాళ్ళుమెలివేసుకు పడవచ్చు, బంతిదెబ్బ తగలవచ్చు!! ఇట్లా ప్రతి ఆటలోనూ, ఏదో ఒకహాని కనపడుతూంటే, శేఖరాన్ని ఆటలకు వాళ్ళు మాత్రం ఎట్లా పోనివ్వగలరు? అదేమిమాయయోగాని, శేఖరానికిఅస్తమానం"పరుగెత్తాలి, ఉరకాలి, పడాలి," అని ఉంటుంది! లేకపోతే ప్రక్కవాడిని ఒక గుద్దు గుద్ది, తానొక నాలుగు తినా లని ఉంటుంది! ఆ దెబ్బలలోనె, ఆ బాధలలోనే, అతనికి ఒకసౌఖ్యం కనబడు తున్నట్లుంది.

శేఖరంమాట అటుంచి, వెంకట్రావుగారు మాత్రం ఏమీ ఆటగాడుకాదు. తన తండ్రి తనకు బాగా ఆర్జించి ఇచ్చేడు. ఒక్కగాని ఒక్కకొడుకు అవడంవల్ల అల్లారుముద్దుగా పెంపుడు పిట్టలా పెరిగేడు. తనలాగే తన సుపుత్రుణ్ణికూడా పెంచుతున్నా డాయన. కాని శేఖరం, తనలాగ తండ్రి చెప్పినట్లు వినక, వెంకట్రావు పద్ధతులను ప్రతిఘటిస్తూ ఉంటాడు. అయినా వెంకట్రావుగారు మాయమాటలు చెప్పి' కుఱ్ఱాణ్ణి మరిపించి. వాడికి ఏవిధమైన హాని కలుగకుండా, పూలలో పెట్టినట్లు పెంచుతున్నాడు.

ఎప్పటిలాగే ఈ సారికూడా శేఖరాన్ని ఆటలకు పోకుండా తప్పించివేశాడాయన. సినిమా చూసి, శేఖరం చాలా ఆనందించేడు. తాను అక్కడ కూమన్నంత సేపూ తానే నాయకుడ ననుకున్నాడు. ఆరాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాక, తోటల్లోకి స్నేహితులతో వెళ్ళినట్లు, అక్కడ హాయిగా ఆడుకుంటుంటే, లలితమ్మగారు పిలిచినట్లు కలవచ్చింది అతనికి. "ఆడుకొనివస్తాలే" అని చెప్పేడు సమాధానంగా. లలితమ్మ డ్రైవరును పంపింది. పట్టుకొని బలవరితాన్ని తీసుకురమ్మని. డ్రైవరు పట్టుకోబోతే అతని చెయ్యి నెత్తురు వచ్చేలా కరిచేశాడు శేఖరం. డ్రైవరు ఏడుస్తూవెళ్ళి వెంకట్రావుగారితో చెప్పేడు.

అబ్బాయిగారు కరిచేరని, నెత్తురుకారేచెయ్యి చూపుతూను. వెంకట్రావు పేక బెత్తం పుచ్చుకుని శేఖరాన్ని వీపుమీద చురుకు చురుకు కొట్టూ .... ఇంట్లోకి తీసుకు వస్తూంటే "బాబోయ్! బాబోయ్! కొట్టకు నాన్నోయ్" అంటూ, ఏడుస్తూ ప్రక్కమీద గిలగిల లాడుతూ లేచేడు శేఖరం. "హాఁ! హాఁ! ఏమిటది శేఖరం! పడుకో!" అంటూ, లలితమ్మలేచి వాడిని పడుకో బెట్ట బోయింది, వీపుమీద చెయ్యివేసి.

"అమ్మా! .... ఆడుకోడానికి వెళ్తేనేం ... నాన్న కొ .... కొ .... కొట్టేడు!" అంటూ ఏడుస్తున్నాడు శేఖరం. "అయ్యో! నాతండ్రీ! కలవచ్చింది కాబోలు! పాడుకల వట్టిది నాయనా! మీ నాన్న మేడమీద నిద్ర పోతున్నారు!" "లేదమ్మా! .... నావీపుమీద .... పే పే ... పేకబెత్తం పుచ్చుకొని ...." అని ఏడుస్తున్నాడు శేఖరం. ఇంతట్లోకి మేడ మెట్లమీద లైటు వెలిగింది. వెంకట్రావుగారు దిగివచ్చేరు "ఏమిటే, అది!" అంటూ. లలితమ్మ తన తొమ్మిదేళ్ళ కొడుకుని ఎత్తుకుని సంగతి చెప్పింది.

"వెఱ్ఱివెధవాయి! అస్తమాను ఆటలు! ఆటలు! పగలూ, రాత్రీ! .... నిద్రకూడా పట్టటంలేదు ఈ ఆటల కోసం! రా, అబ్బీ! దా! నేనెత్తుకుంటా దాఁ!" అని వెంకట్రావుగారు శేఖరాన్ని ఎత్తుకున్నాడు. శేఖరం "నాన్న .... నువ్వేం ... నన్నేం .... ఆడుకోడానికి వెడితేనేం ...." అంటూ ఒక్కుమ్మడిగా ఏడ్చేడు. ఈ బెంగతో కొడుకు ఆరోగ్యం చెడుతుందేమోనని భయ పడ్డాడు వెంకట్రావుగారు. "పిచ్చితండ్రి! తెల్లవారేక .... రేపు నీ స్నేహితులతో నీ ఇష్టం వచ్చినట్లు ఆడుకో!" అన్నాడాయన "అయితే కోతికొమ్మచ్చి ఆడుకుంటాము నాన్నా!" అని అడిగేడు శేఖరం ఏడుపు మానడానికి యత్నిస్తూ, "ఊఁ, సరే! అట్లాగే" "ఊహుఁ, అది కాదు, నాన్నా! మా స్నేహితులంతా రేపు నేరేడు పండ్లు కోసుకోడానికి వెళ్తామన్నారు! నేనుకుడావెళ్తా నాన్నా!" "హుఁ సరే!! పండుకో!" అన్నాడాయన, శేఖరం తల తన రొమ్ముమీద ఆన్చుకొని, జుట్టు నిమురుతూ.

★




నిరంతర

సహవాసిని

మీరు మకాం చేస్తున్నా, లేక ఇంటిలోనే ఉన్నా, ఇటియాల్ మీకు నిరంతర సహవాసిగా ఉంటుంది. దానిని నమ్మకంగా మీరువాడవచ్చును.

సెప్టిక్ కానివ్వదు, క్రిమివిధ్వంసిని, ఆహ్లాదకరమైనది.

ఉత్పత్తిదారులు :

I·T·I

ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిమిటెడ్;

మల్లేశ్వరం, బెంగుళూరు.

సేల్సు డిపార్టుమెంటు :

35/37, తంబుచెట్టీ స్ట్రీటు,

మద్రాసు 1.

